క్లుప్తంగా

నాణ్యమైన భోజనం పెట్టాలి

దోమకొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సూచించారు. గురువారం గొట్టిముక్కులలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. వర్షాకాలం విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని, తాగునీరు, భోజనం విషయంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. జీపీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్తులు ఉన్నారు.

పాఠశాలల తనిఖీ

లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లి, అయ్యపల్లి, శెట్పల్లి తండా ప్రాథమిక పాఠశాలలను గురువారం మండల విద్యాధికారి షౌకత్ అలీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులు ప్రతీ రోజు వంద శాతం హాజరయ్యే విధంగా చూడాలన్నారు. పలు సూచనలు, సలహాలిచ్చారు. కాంప్లెక్స్ హెచ్ఎం వసుధ, ఉపాధ్యాయులు శ్యామల, యశోద, సాదియా, రాములు, సర్దార్, అనురాధ, సంతోష్ ఉన్నారు.

డాక్టరేట్ ప్రదానం

లింగంపేట(ఎల్లారెడ్డి): పొల్కంపేట గ్రామానికి చెందిన తలారి హరీష్ కుమార్ గురువారం హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం(తెలుగు విభాగం) నుంచి పీహెచ్‌డీ(డాక్టరేట్) పట్టా అందుకున్నారు. ఆచార్య పమ్మి పవన్ కుమార్ పర్యవేక్షణలో కథా సాహితి ప్రచురిత పాతికేళ్ల కథా సాహిత్యం–సామాజికాంశాల పరిశీలన అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు హరీష్ తెలిపారు.

వరల్డ్‌వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన రెంజర్లవార్ రవికుమార్–అమూల్య దంపతుల కుమారుడు వియాన్ వరల్డ్‌వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించాడు. రెండు సంవత్సరాల మూడు నెలల వయసు గల వియాన్.. దేశంలోని 29 రాష్ట్రాల రాజధానుల పేర్లను కేవలం 41 సెకన్లలోనే సమాధానాలు చెప్పి రికార్డ్స్‌లో పేరు సంపాదించినట్లు స్థానికులు తెలిపారు. వియాన్, వారి తల్లిదండ్రులను స్థానికులు అభినందించారు.

అధికారులు స్పందించారు

సాక్షి ఎఫెక్ట్..



మాచారెడ్డి: ఘన్‌పూర్(ఎం)లో 'నీరు ఎక్కడ పట్టుకునేది..?' శీర్షికన నేటి చిత్రంలో గురువారం ప్రచురితమైన కథనానికి ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి చైతన్య స్పందించారు. మినీ వాటర్ ట్యాంకు చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగింపజేశారు.

'ఉపాధ్యాయుడిపై దాడి హేయం'



కామారెడ్డి అర్బన్: కామారెడ్డిలో ఉపాధ్యాయుడు బాలకృష్ణపై ఓ విద్యార్థి తండ్రి దాడిచేయడం హేయమైన చర్య అని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం దామోదర్‌రెడ్డితో పాటు జిల్లా నాయకులు దాడికు గురైన బాలకృష్ణను పరామర్శించారు. అనంతరం దామోదర్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయులపై దాడి మూర్ఖత్వమన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గర్దాస్ గోవర్ధన్, సుధాకర్, బిల్యా, విష్ణువర్ధన్, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు రమణ, హన్మండ్లు, రాజు, సంతోష్‌కుమార్, స్వామి, కృష్ణారావు, శ్రీనివాస్, అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలకు ఎంపిక

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం నర్వ, గున్కుల్ గ్రామాలకు చెందిన కండె బొల్లారం వైష్ణవి, మాసుల బిందుశ్రీ క్రీడా పాఠశాలకు ఎంపికయ్యారు. ఇద్దరు విద్యార్థినులు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సమ్మె నోటీసు అందజేత

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపల్ కార్మికులు గురువారం మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్‌కు సమ్మె నోటీసును అందించారు. వచ్చే నెల 9న దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నందున దీనిలో భాగంగా విధులకు హాజరు కాలేమంటూ నోటీసులో పేర్కొన్నారు. నాయకులు వెంకటేశం, రమణ, మహేందర్ తదితరులున్నారు.



నూతనంగా నిర్మించిన 30 పడకల ఆస్పత్రి భవనం



వైద్యులు లేక వేచి ఉన్న రోగులు



మంగళవారం వైద్యుడు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

వేధిస్తున్న వైద్యుల కొరత

- మౌలిక వసతులూ కరువే..
- పిట్లం ఆస్పత్రిలో ఇబ్బందులు పడుతున్న రోగులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. మౌలిక వసతులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక చికిత్స కేంద్రంగా ఉన్న ఆస్పత్రిని గతంలో 30 పడకల ఆస్పత్రిగా మార్చారు. ఈ ఆస్పత్రికి మండలంలోని రోగులే కాకుండా మెదక్ జిల్లా తడ్కల్, కంగ్టి మండలాల నుంచి కూడా వైద్యం కోసం వస్తుంటారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున ఈ సమయంలో ప్రజలు సీజనల్ వ్యాధులతో ఆస్పత్రికి వస్తే మాత్రం వైద్యాధికారులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నిత్యం పిట్లం ఆరోగ్య కేంద్రానికి సుమారు 200 మంది వరకు రోగులు వైద్యం కోసం వస్తుంటారు. శుక్రవారం సంత ఉంటుంది కాబట్టి ఆ రోజు రోగుల సంఖ్య మరింత పెరుగుతుంది. ఆస్పత్రికి వచ్చే వారిలో రోగులతో పాటు గర్భిణులు, చిన్న పిల్లలు కూడా ఉంటారు. వారికి వైద్యం అందించాలంటే ఆస్పత్రిలో కనీసం ఆరుగురు వైద్యులు ఉండాలి. ప్రస్తుతం ఇద్దరు కాంట్రాక్ట్ డాక్టర్లు మాత్రమే ఉన్నారు. వారిని డిప్యుటేషన్‌పై ఇతర ఆస్పత్రి నుంచి పిట్లం ఆస్పత్రికి బదిలీ చేశారు. వారు కూడా సమయపాలన పాటించడం లేదు. మంగళవారం ఉన్న ఇద్దరు వైద్యుల్లో ఉదయం 11 దాటినా ఒకరు కూడా రాకపోవడంతో ఆస్పత్రిలో రోగులు ఉదయం నుంచి ఎదురు చూస్తూ కూర్చున్నారు. ఎంతకూ వైద్యులు రాకపడంతో ఆయుష్ మెడికల్ ఆఫీసర్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ రిపేర్ అయితే దానికి మరమ్మతులు నిర్వహించి వినియోగించకుండా కామారెడ్డికి తరలించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల కొరత వల్ల రోగులు ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. కొందరు బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించి, వైద్యులను నియమించాలని రోగులు, స్థానికులు కోరుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో రూ.12 కోట్లతో..

మండలంలో జనాభా, రోగుల సంఖ్య పెరడగంతో గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే చొరవతో రూ.12 కోట్ల నిధులతో పిట్లంకు 30 పడకల ఆస్పత్రి భవనం మంజూరైంది. భవనం నిర్మాణ పనులను అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. భవనం సైతం దాదాపు పూర్తయింది. పాలకులు, అధికారులు స్పందించి నూతన భవనంలో ఆస్పత్రిని ప్రారంభించి పూర్తి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన భవనంలోకి మార్చాలి



ప్రస్తుతం పిట్లంలో కొనసాగుతున్న పాత ప్రభుత్వ ఆస్పత్రిలో గదులు, వసతులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పిట్లంలో నిర్మించిన నూతన భవనంలోకి ఆస్పత్రిని మార్చితే రోగుల సమస్యలు పూర్తి స్థాయిలో తీరుతాయి. అధికారులు, పాలకులు స్పందించి నూతన భవనంలో ఆస్పత్రిని ప్రారంభించి, పూర్తి స్థాయి వసతులు కల్పిస్తే బాగుంటుంది.

– నీలకంటి మనోహర్, పిట్లం

వైద్యులను నియమించాలి



అత్యవసర పరిస్థితుల్లో పిట్లం ఆస్పత్రిలో వైద్యులు లేకపోవడంతో బాన్సువాడకు, లేదా ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో రోగులకు సమయంతో పాటు ఆర్థిక నష్టం జరుగుతుంది. అధికారులు, పాలకులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా వైద్యులు, మౌలిక వసతులు కల్పించి ఒక వైద్యుడిని 24 గంటలూ ప్రభుత్వ ఆస్పత్రిలో నియమిస్తే బాగుంటుంది.

– పోష, పిట్లం

నేటి చిత్రం



కట్టి డిపో దగ్గర ఏర్పడిన గుంతలు

మట్టి రోడ్డుగా మారిన బీటీ రోడ్డు

రామారెడ్డి: మండల శివారులోని కట్టిడిపో దగ్గర నుంచి రెండు కిలోమీటర్ల మేర సింగిల్ రోడ్డుపై అక్కడక్కడా గుంతలు ఏర్పడ్డాయి. తారు రోడ్డు ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయి. ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి వర్షాకాలంలో కనీసం గుంతలనైనా పూడ్చితే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి.

– రాజేందర్, మద్దికుంట

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576
బాన్సువాడ : 94402 11363
జుక్కల్ : 97053 46578

పని చేయని మూడో కన్ను

- పెరుగుతున్న చోరీలు
- పట్టించుకోని అధికారులు



నస్రుల్లాబాద్ బస్టాండ్‌లో పనిచేయని సీసీ కెమెరాలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నిఘా లోపించడంతో దొంగతనాలు పెరిగి పోతున్నాయి. ఐదేళ్ల క్రితం నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలు ప్రస్తుతం పని చేయడం మానేశాయి. దీనితో దొంగతనాలు జరిగితే కనీసం వెతకడానికి వీలు లేకుండా పోయింది. నస్రుల్లాబాద్ బస్టాండ్ ప్రాంతంలో అప్పటి ఎస్సై.. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం పని చేయడం లేదు. మండల కేంద్రానికి చెందిన పలువురి బైక్‌లు చోరీకి గురైన ఘటనలున్నాయి. ఓ వ్యక్తి కుల వృత్తి చేసుకోవడానికి చెట్టు ఎక్కి దిగి వచ్చే సరికి బైక్ దొంగతనం జరిగింది. ఇది జరిగి సంవత్సరాలు జరిగినా లాభం లేకుండా పోయింది. అంతే కాకుండా నెమ్లి గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధికి చెందిన బైక్ ఆలయం ముందు నిలిపి దైవ దర్శనం చేసుకుని వచ్చే సరికి ఎత్తుకెళ్లారు. కొన్ని నెలల క్రింతం మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి ముందు నిలిపిన బైక్‌ను కొంత దూరం నడుకుంటూ తీసుకెళ్లి మరీ ఎత్తుకెళ్లారు. ఈ ఘటనను ఓ పంక్చరు షాపులో పరిశీలన చేసినా ఉపయోగం లేకుండా పోయింది. ప్రధాన రహదారుల వెంట సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే రోడ్డు ప్రమాదాలు చేసి తప్పించుకుని వెళ్లే వారిని తేలికగా పట్టుకోవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం



పెద్దగుజ్జుల్‌తండాలో డీఎస్పీ శ్రీనివాస్‌రావు, పోలీసులు



రాంపూర్‌లో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు

గాంధారి(ఎల్లారెడ్డి): మారుమూల గిరిజన తండాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం ఆయన సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, స్థానిక ఎస్సై ఆంజనేయులుతో కలిసి పెద్దగుజ్జుల్‌తండాను సందర్శించారు. ఈ సందర్భంగా తండావాసులు డబ్బులు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన 10 సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో తండావాసులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. తండాలో, పరిసర ప్రాంతాల్లో అనుమానితులు కనపడితే వెంనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నేరాలను అరికట్టవచ్చు

పిట్లం(జుక్కల్): గ్రామాలలో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తే, వాటి వల్ల నేరాలను తేలికగా అరికట్టవచ్చని ఎస్సై రాజు పేర్కొన్నారు. రాంపూర్‌లో గ్రామస్తుల సహకారంతో గ్రామంలోని ప్రధాన ప్రదేశాలలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని గురువారం ఎస్సై రాజు ప్రారంభించారు. అన్ని గ్రామాలలో గ్రామస్తులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని సూచించారు.

నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



కామారెడ్డి అర్బన్: ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక ఎన్‌జీవోస్ కాలనీ శ్రీలలితా త్రిపుర సుందరీదేవి ఆలయంలో గురువారం శ్రీవారాహి అమ్మవారి గుప్త నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పట్టణంలో తొలిసారిగా వారాహి అమ్మవారి గుప్త నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని వేద పండితులు అంజనేయశర్మ అన్నారు.

గ్రామ దేతలకు జలాభిషేకం

బిచ్కుంద(జుక్కల్): వరుణదేవుడు కనికరించి వర్షం కురిపించాలని కోరుతూ గురువారం బిచ్కుంద పట్టణ ప్రజలు దేవతలకు జలాభిషేకం చేశారు. వ్యాపారులు స్వయంగా దుకాణాలు మూసేసి పూజలో పాల్గొన్నారు. బండాయప్ప మఠం పీఠాధిపతి సోమాయప్ప స్వామీజీ, వార్కారీలు కమ్మరి గుడి శివాలయం, హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్, కమల్‌కిషోర్, నాల్చర్‌రాజు, దర్పల్ గంగాధర్, అశోక్, రైతులు పాల్గొన్నారు.

హిందువులు ఏకం కావాలి

కామారెడ్డి అర్బన్: హిందువులు కులాలకు అతీతంగా ఏకం కావాలని హర్యానాకు చెందిన లేక్‌రామ్ స్వామీజీ అన్నారు. సనాతన ధర్మం, హిందూ ఐక్యత కోసం మార్చి 22న ప్రారంభించిన కన్యాకుమారి–అయోధ్య అఖండ రామజ్యోతి పాదయాత్ర గురువారం కామారెడ్డికి చేరుకోగా విశ్వహిందూ పరిషత్ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామీజీ రామేశ్వరపల్లి జైగురు దత్త ఆశ్రమంలో మాట్లాడారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, ఉపాధ్యక్షుడు సామల గంగారెడ్డి, కార్యదర్శి బొల్లి రాజు, ప్రచార ప్రముఖ్ జీ.శ్రీకాంత్‌రావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పోచారం కాలువలో పూడిక తీయాలి



ఎల్లారెడ్డి: పోచారం కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించాలని కోరుతూ లింగారెడ్డిపేట రైతులు గురువారం తహసీల్దార్ ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కాలువలో పూడిక పెరిగిపోవడంతో సరిపడా నీరు పంటలకు అందడం లేదని, దీనిని దృష్టిలో ఉంచుకుని పంటలకు నీరు అందేలా తగిన చర్యలను తీసుకోవాలని కోరారు.

విద్యుత్ తీగలను సరిచేయరూ..



ఎల్లారెడ్డి: మాచాపూర్‌లో ఇటీవల వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభం నేలకొరిగి విద్యుత్ తీగలు కింద పడినా వాటిని అధికారులు సరిచేయడం లేదని రైతు సాయిలు వాపోయారు. తీగలు కింద పడడంతో వ్యవసాయ పనులు చేసుకోవడంలో ఇబ్బందులు కలుగుతున్నాయని, అధికారులు స్పందించి విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి తీగలను సరిచేయాలని రైతు కోరుతున్నారు.

కృష్ణాజీవాడిలో తాగునీటి సమస్య

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజీవాడి గ్రామంలో ప్రజలు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారు. బోర్లకు సంబంధించిన రెండు మోటార్లు కాలిపోవడమే కాకుండా మిషన్ భగీరథ ద్వారా నీళ్లు సరిగా రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో దూరంలో ఉన్న శివాలయం బోరు వద్దకు వెళ్లి బిందెలలో నీళ్లను తెచ్చుకుంటున్నారు. గ్రామ కార్యదర్శిని తాగునీటి విషయమై అడగ్గా ట్యాక్స్‌లు కడితేనే కరెంటు మోటార్లను రిపేరు చేయిస్తామని అంటున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి తాగు నీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



గుల్లా నుంచి గుల్లాతండా వెళ్లే రోడ్డు

చెరువును తలపిస్తున్న రోడ్డు

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం గుల్లా నుంచి గుల్లా తండాకు వెళ్లే ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఇకనైనా స్పందించి గుల్లా రోడ్డును బాగు చేసి ప్రయాణికులు, వాహనచోదకుల కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

బాన్సువాడ రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి, కల్తీ మద్యం సేవించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి క్రయవిక్రయాలు జరిగితే 1908 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. మాదక ద్రవ్యాల నిరోధంపై సామూహిక ప్రతిజ్ఞ చేపట్టారు. డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో ముజాహిద్, ఏపీవో భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపల్

పోటీల్లో విజేతలకు అభినందనలు

కామారెడ్డి అర్బన్: మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన 'మాదక ద్రవ్యాలు వద్దు–జీవితం ముద్దు' అంశంపై నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందినట్టు ప్రిన్సిపల్ కే.విజయ్‌కుమార్ తెలిపారు. విజేతలు పి.అనిల్‌కుమార్, ఎండీ తహనసీర్, టి.రచన, ఏకే నితిన్‌గౌడ్, ఈ.సౌమ్యలను గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ అభినందించారు.

సంక్షిప్తం

సీపీఎం సమావేశానికి తరలిరావాలి

ఎల్లారెడ్డి: కామారెడ్డిలో నిర్వహించే సీపీఎం సమావేశానికి నాయకులు హాజరు కావాలని సీపీఎం నేత మోతీరాం నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం జూలై 1న కామారెడ్డిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ధర్నాను విజయవంతం చేయండి

దోమకొండ: హైద్రాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఈనెల 27న జరిగే తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ధర్నాను విజయవంతం చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్లు విజయరామరాజు, సునంద కోరారు. గురువారం వారు మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే విద్యారంగ వ్యతిరేక విధానాలను తిప్పికొడదామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను, అందరికీ నిర్బంధ ఉచిత విద్య రాజ్యాంగ సూత్రాన్ని కాపాడుకుందామని తెలిపారు. ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ నియామకాలు జరగాలని, పెండింగ్ ఖాళీలను భర్తీ చేయాలని కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

నేడు తాడ్వాయిలో సామాజిక తనిఖీ సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కూలీలు తరలిరావాలని కోరారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

మద్నూర్(జుక్కల్): జూలై 7న ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమయ్య అన్నారు. డోంగ్లీలో గురువారం పార్టీ నాయకులతో ఆయన మాట్లాడారు. 30 సంవత్సరాల నుంచి ఎస్సీ వర్గీకరణ సాధన, మాదిగల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ఏర్పాటైన ఎంఆర్‌పీఎస్.. ఎస్సీ వర్గీకరణ కష్టపడి సాధించిందన్నారు. గౌరవ అధ్యక్షుడు మారుతి, ఉపాధ్యక్షుడు నర్సింగ్, సలహాదారులు హన్మంత్, కిషన్, జ్ఞానేశ్వర్, చందు, నగేశ్, ఏక్‌నాథ్ తదితరులున్నారు.

హన్మాజీపేట్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

బాన్సువాడ రూరల్: హన్మాజీపేట్ జీపీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజేష్ తెలిపారు. గురువారం గ్రామంలో పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయించామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

సమయపాలన పాటించాలి

గాంధారి(ఎల్లారెడ్డి): ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు అంకితభావంతో పాఠాలు బోధించాలని ఎంఈవో శ్రీహరి అన్నారు. గురువారం ఉదయం ఆయన స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో ప్రార్థనలో పాల్గొన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఫిజియోథెరపి శిబిరం

దోమకొండ: మండల కేంద్రంలోని శివరామ మందిర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గల భవిత కేంద్రంలో గురువారం విద్యార్థులకు ఫిజియోథెరపి శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పన్యాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయులు ప్రభావతి, సంతోష్ కుమార్, నాగరాజు, దామోదరచారి పాల్గొన్నారు.